

# ఒకనాటి ప్రియతమా!

చందు సోంబాబు

రాత్రి పది గంటలయింది. బార్లోంచి బయటకొచ్చాను.

హాఫ్ బాటిల్ విస్కీ పూర్తిగా తాగినా, అశాంతి నన్ను విడిచిపోలేదు.

'అశాంతి!'

నా మనసుని తింటోంది.

నా ఆలోచనలను దహిస్తోంది.

సిగరెట్ వెలిగించి అడుగు ముందుకేశాను.

అడుగులు తడబడుతున్నాయి. సరిగ్గా నడవలేని ఆయోమయ పరిస్థితిలో నడుస్తున్నాను.

తూలిపోతూ నడుస్తున్నాను. నా మనసులో గట్టిగా సర్ది చెప్పుకున్నాను.

'నేను నడవగలను' - 'నేను నడవగలను.'

శక్తిని కూడతీసుకుని నడుస్తున్నాను.

ఇంటి కెళ్ళాలని లేదు.

ఇంటికెళ్ళి నేనేం చేయాలి?

అంధకారం! నా చుట్టూ అంధకారం!

ఒంటరిని.

దౌర్భాగ్యుడిని.

పాపిని.

పాపం నన్ను వెంటాడుతోంది.

ఈ పాపాన్నించి నాకు విముక్తి లేదు. ఆ సంగతి నాకు తెలుసు.

నాకు ఏడుపొస్తోంది.

ఎవరన్నా నన్ను గమనిస్తున్నారని గానీ, గుర్తుపడతారని గానీ సిగ్గుపడ్డంలేదు - భయపడ్డంలేదు.

నేను వాటికి అతీతుడ్ని.

నేను చచ్చిపోయిన మనిషిని.

బ్రతుకు లేని దౌర్భాగ్యుడిని.

ఓ మంచివాడి సుఖాన్ని తినేసిన రాక్షసుడ్ని.

రోజూ చాలాసార్లు అనిపిస్తుంది- చావాలని. కానీ చచ్చేంత ధైర్యం నాలో లేదు.

పిరికివాడిని.

చావడానికి ధైర్యంలేని పిరికివాడిని.

బతకడానికి ధైర్యంలేని పిరికివాడిని

మరి ఈ బతుక్కి అర్థం ఏమిటి?

కృష్ణా బేరేజిమీద కొద్దిసేపు నించున్నాను.

చల్లనిగాలి వంటిని తాకుతోంది-కానీ తలలోని నరాలు చిట్లిపోతున్నాయి.

కృష్ణవేణి సుడులు తిరుగుతోంది.

వెన్నెల్లో మనోహరంగా ఉంది కృష్ణవేణి.

తదేకంగా చూసిన నా కళ్ళకి కృష్ణవేణి ఆప్యాయంగా నన్ను తన కౌగిలిలోకి ఆహ్వానిస్తున్నట్టుగా అనిపిస్తోంది.

కొన్ని నిమిషాలు....అవసరంలేదు— కొన్ని సెకన్లు చాలు .... ఎగిరి బేరేజి పైనుంచి కిందకి దూకేస్తే నా జీవితానికి విముక్తి దొరుకుతుంది.

ఏడుపొచ్చింది.

నేను చనిపోతే నాకోసం ఏడ్చేవాళ్లు లేరు.

దిక్కులేని శవంగా నీళ్ళప్రవాహంలా కొట్టుకొని పోవలసిందే!

నా కళ్ళముందు లీలగా కృష్ణజ్యోతి రూపం మెదిలింది.

కృష్ణజ్యోతి!

ఆ ముగ్ధ మనోహర రూపం నన్ను పిచ్చివాడిని చేస్తోంది.

కృష్ణజ్యోతి నాకు దూరమై పన్నెండేళ్ళయింది.

అయినా ఆమె రూపం నా గుండెల్లోంచి చెదిరిపోలేదు....చెరిగిపోలేదు - సజీవంగా నా గుండెల్లోనే ఉంది.

కృష్ణజ్యోతి నా ప్రేమజ్యోతి!.... నా జీవన జ్యోతిగా భావించాను.

నా గుండెని గుండుసూదులతో గుచ్చుతున్నట్లుగా అనిపిస్తోంది.

కృష్ణ, నేమా కాలేజిలో క్లాస్‌మేట్స్‌మి. మా మనసులు కలిసినయి.

మే మిద్దరం చెట్టాపట్టా లేసుకొని ఎన్నో సినిమాలు చూశాం. పార్కుల్లో గంటల తరబడి కూర్చుని తియ్యగా మాట్లాడుకునేవాళ్ళం. ఒకరిపట్ల ఒకరి కెంతో ఆరాధన!

ఒక్కొక్క సంఘటన నా కళ్ళముందు రీలుగా తిరుగుతూంటే, నా గుండెని ముక్కలుగా తరుగుతున్నట్లుంది.

* * *

లైబ్రరీలో ఏదో పుస్తకం వెతుక్కుంటోంది, కృష్ణ. నేను వెనగ్గా వెళ్ళి ఆమె నడుముచుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకున్నాను. కృష్ణ వెనక్కి తల తిప్పి చూసింది. అదే అదనుగా ఆమె పెదవుల పైన ముద్దు పెట్టుకున్నాను.

'ఛీ! ఏమిటిది!' అంది చిరుకోపంతో.

'ఇది తొలి ముద్దు కృష్ణా' అన్నాను.

కృష్ణ మనోహరంగా నవ్వింది.

'బతికినంత కాలం గుర్తుంచుకొంటాను' అంది కృష్ణ.

* * *

నా కళ్ళలో నీరు నిలిచింది.

'కృష్ణా! నిన్నంతగా ప్రేమించి నీకు ద్రోహంచేసిన రాక్షసుణ్ణి కదూ!'

అక్కడ నిలవాలనిపించలేదు. భారంగా, బరువుగా నడుస్తూ అడుగులేస్తున్నాను.

వెనకనించి నా భుజంపైన ఎవరిదో చెయ్యిపడింది.

వెనక్కి తిరిగి చూశాను.


'రాజు!'

వాడు నా కొలీగ్!

"నీ కెన్నిసార్లు చెప్పాలి రాం? తాగి ఇలా రోడ్లమీద తిరగడం మంచిది కాదు, పద ఇంటి దగ్గర దింపుతాను" అన్నాడు రాజు.

"నా కేం మిగిలిందని?" అన్నాను.

"జరిగే ప్రతిదానికీ ఓ కారణం ఉంటుంది. శివుడి ఆజ్ఞలేనిదే చీమకూడా కుట్టదంటారు. ఏది జరిగినా మనం నిమిత్తమాత్రులమని గుర్తుంచుకోవాలి."




"గీతోపదేశమా?" నవ్వేను.

రాజు రిక్షా పిలిచి గాంధీనగరానికి మాట్లాడేడు.

రిక్షాలో కూర్చున్నాక చెప్పాడు.

"రాజారావు మాష్టారి పరిస్థితి ఏమీ బాగాలేదు. ఇవేళ సాయంత్రమే చూశాను".

"ఊఁ" అన్నాను.

"ఆయనకి కేన్సర్. అట్టే రోజులు బతకడు రాం" చెప్పాడు రాజు.

రాజు చెబుతోన్న మాటలు వింటూంటే నా మీద నాకే అసహ్యం కలిగింది.

రాజారావు ఈ పరిస్థితికి రావడానికి నేనే కారణమని రాజు చెబుతున్నాడని పించింది.

అది నిజమే!

కాదని కొట్టిపారేసే ధైర్యం నాలో లేదు.

రాజారావు చాలా మంచివాడు. నాకు అప్పట్లో జువాలజీ లెక్చరర్ ఆయన. ఆ మనిషి నిండుజీవితం నాశనం కావడానికి నే నెంతవరకూ బాధ్యుడినో నాకు బాగా తెలుసు.

సిగరెట్ వెలిగించి రాజు మాటలని వింటున్నాను.

"ఆయన్ని నీవు కలిసావా."

"ఊ"

"ఆయన బాధల్లా ఒక్కటే రాం"

"ఏమిటి" అన్నాను మెల్లగా.

"నీకు తెలుసు. కన్న కూతురు తప్ప నా అనేవాళ్ళెవరూ లేరు. తను పోతే ఆ పిల్ల బతుకేమవుతుందోనని ఏడుస్తున్నాడు. ఆడపిల్ల....ఇంకా లోకం గూర్చి ఏమీ తెలీని పసిపిల్ల, నిండా పదమూడు దానికి."

నా నెత్తిమీద సమ్మెటతో బాదుతున్నట్టున్నాయి రాజు చెప్పే ఒక్కొక్క మాట.

నిజమే! మాష్టారు పోతే ఆ పాప భవిష్యత్తు ఏమిటి?

రాజు నన్ను ఇంటి దగ్గర దింపేసి రిక్షాలో వెళ్ళిపోయాడు.

తాళం తీసి లోపల అడుగుపెట్టాను. లైటువేసి తలుపులు మూసుకుని మంచం పైన వాలిపోయాను.

అది చాలా కాలంగా నా దిన చర్య.

ఎదురుగా ఫోటో ఫ్రేంలో కృష్ణజ్యోతి ఫొటో.

వెక్కి వెక్కి ఏడ్చాను.

అసలెందుకలా జరిగింది?

* * *

రాజారావు మాష్టారికి ఎవరూ లేరు. వారాలు చేసుకుని స్వయంశక్తితో పైకొచ్చిన మనిషి రాజారావు.

అయన దగ్గర నేను, నాతోపాటుగా కృష్ణజ్యోతి చేరాం. ట్యూషన్ కాగానే కృష్ణని ఆమె ఇంటి దగ్గర విడిచిపెట్టి నేను వెళ్లేవాడిని.

కృష్ణ, నేనూ ఆయన ముందు కూడా చనువుగా ఉండేవాళ్ళం. ఆయనకి ఆ సంగతి తెలుసు.

అయితే నాకు తెలీకుండా ఇక్కడే జరిగిపోయింది నాకు అన్యాయం.

మాష్టారు కృష్ణని చేసుకుంటానని కృష్ణవాళ్ళ నాన్నగారిని అడగడం, ఆయన ఒప్పుకోవడం, కృష్ణకీ, మాష్టారికీ పెళ్లి జరిగిపోవడం.... మొత్తం పదిహేను రోజుల్లో జరిగిపోయింది.

నేను పిచ్చివాడినై పోయాను.

కృష్ణ ఎలా ఒప్పుకుందో నాకు అర్థం కాలేదు.

కృష్ణ చదువు మానేసింది.

నాకు ఈ ప్రపంచం శూన్యంగా గోచరించింది.

గుండెలో అగ్నిపర్వతాలు బద్దలై పోతున్నా, నా ప్రియురాలి జీవితం సుఖంగా వుండాలని మనసారా దేవుణ్ణి కోరుతూ, పెళ్లి పందిట్లో అక్షింతలు వేశాను.

నాలో చాలా మార్పు వచ్చింది. యాంత్రికంగా మారిపోయాను. దేనిపైనా ఆసక్తి లేదు. విరక్తితో జీవితం గడుపుతున్నాను.

నేను ట్యూషన్ మానేశాను. ఆయన ఒకటి, రెండుసార్లు నన్ను హెచ్చరించారు. అయినా వెళ్లలేదు.

చాలామందికి తెలుసు_నేను కృష్ణ కలిసి తిరగడం.

కృష్ణ నన్ను ప్రేమించలేదా?

కేవలం ఓ స్నేహితుడిగానే నన్ను భావించిందా?

కాని నేను స్నేహితుడిగా ఎన్నడూ ప్రవర్తించ లేదు. ఆమె నా సొంతం అన్నట్టుగా చాలా చొరవగా ఆమెని ముట్టుకొనేవాడిని: ముద్దాడేవాడిని: కౌగలించుకొనేవాడిని, సినిమాహాల్లో ఆమె గుండెలు తడిమేవాడిని.

ఇంత చనువుని ఆమె నాకిచ్చిందంటే ఆమె నన్ను ప్రేమించినట్టు కాదా!

నాలో మిగిలిన శేష ప్రశ్నకి సమాధానం తెలుసుకోవాలి.

ఒకనాటి ప్రియురాలు కృష్ణ నన్ను ప్రేమించానని ఒక్కమాట చెబితే చాలు.

సంవత్సరం గిర్రున తిరిగిపోయింది. కృష్ణకి పాప పుట్టింది.

చూడ్డానికి వెళ్లాలనిపించింది, కానీ వెళ్లలేకపోయాను.

ఆ పాపకి తండ్రిని కావల్సిన నేను ఆ పాపని నా గుండెలపై కెక్కించుకుని ఆడించవలసిన నేను.... ఏమీ కాకుండానే పోయాను.

అప్పుడప్పుడు కృష్ణ, మాష్టారు కలిసి అక్కడక్కడా కనబడేవాళ్లు. కానీ చూడనట్టుగానే నటించేవాడిని.

మరో సంవత్సరం గడిచింది.

నాలో ఆరాటం పెరిగిపోతోంది. కృష్ణని చూడాలి.... మాట్లాడాలి.

మాష్టారు ఇంట్లోలేని సమయం చూసి నేను వెళ్లాను.

కృష్ణ ఎదురుగా నించున్నాను.

కృష్ణ మాటల్లేకుండా .... బొమ్మలా నించుంది.

"కృష్ణా" అన్నాను.

ఆమె తలెత్తి చూసింది.

"కూర్చో" అంది.

"బాగున్నావా?" అడిగాను.

"ఆఁ"

"నిన్నొకమాట అడగనా?"

కృష్ణ అదోలా నవ్వింది.

ఆ నవ్వు "నువ్వెన్నాళ్ల తర్వాతనా అడిగేది?" అన్నట్టుగా ఉంది.

"నువ్వు నిజంగా నన్ను ప్రేమించలేదా?" అడిగాను. నాలో ఆత్రుత.... ఆమె ఏమంటుందో వినాలన్న ఆరాటం... తపన....

"ఇప్పుడెందుకు?" అంది.

"నా ప్రేమ భగ్నమైపోవటానికి కారణం ఏమిటో నాకు తెలీదు. తప్పు నాలో ఉందా అన్న అనుమానం ప్రతిక్షణం నన్ను కాల్చేస్తోంది. నేను బతకలేక పోతున్నాను. ప్లీజ్, చెప్పు. నువ్వు నిజంగా నన్ను ప్రేమించలేదా? పీది ప్రేమ కాదా!" ఆవేశంగా అడిగాను.

ఆమె కళ్లలో నీరు.

నేను నించున్నాను. ఆమె దగ్గరగా నడిచాను.

"నేను నిన్ను బాధపెట్టాలని కాదు కృష్ణా. నువ్వు ప్రేమించానని చెబితే చాలు. ఆ ఒక్కమాట చాలు ఈ దౌర్భాగ్యుడు బతకడానికి" అన్నాను!

"నేను నీ ప్రియురాలిని. ఆ సంగతి నీకు తెలుసు. నేను నిన్ను ప్రేమించలేదని ఎలా అనుకున్నావు రాం? ఆనాడు నువ్వు నా పెదవులపైన వేసిన తొలి ముద్రని నా గుండెల్లోనే దాచుకున్నాను. నిన్ను ప్రేమించాను." అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

ఆ మాట చాలు నాకు. కానీ.... ఆమె మాష్టార్ని ఎందుకు పెళ్లి చేసుకుంది?

అదే అడిగాను.

కృష్ణ రెండు క్షణాలు మౌనం వహించింది. నాకేసి చూసి పిచ్చిగా నవ్వింది.

"నువ్వు సుఖంగా ఉండాలని" అంది.

"అంటే?"

"నేనీ పెళ్లికి ఒప్పుకోకపోతే నీ ప్రాణాలు తీయించేస్తానన్నాడు మావయ్య. మా మావయ్య సంగతి నాకు తెలుసు. అందుకే.... నువ్వు సుఖంగా ఉండాలనే నేను మౌనంగా ఉండిపోయాను", ఆమె కళ్లలోంచి నీరు జారుతోంది.

ఆ క్షణంలో ఆమె నాకు దేవతలా కనిపించింది.

"నాకు తెలుసు కృష్ణా, నీ ప్రేమ కాలుష్యం లేనిదనీ, నాకు తెలుసు కృష్ణా, నువ్వు రత్నా:వని" ఆమె భుజాల చుట్టూ చేతులు వేశాను.

"కానీ ఒక్క సంగతి మరిచిపోయావు. నీ ప్రేమకోసం నా ప్రాణాలు పోయినా బాధపడేవాడిని కాను. నీకోసం నీ ప్రేమకోసం ఆ మాత్రం త్యాగం చేయలేకపోయేవాడినా!" అన్నాను.

"కనీసం నిన్ను కంటితో చూసుకుంటూ బతకాలనే రాం, నేను అప్పుడనుకున్నది" అంది.

అంతే!

నాలో ఆవేశం ఉప్పెనలా పొంగింది. కృష్ణని నా కౌగిలిలోకి తీసుకొని ఆమెని ముద్దులతో నింపేశాను. నా ఆవేశం ఎంత అనర్థానికి దారితీసిందో ఆ మరుక్షణమే నాకు తెలిసింది.

మాష్టారు గుమ్మంలో నిలుచుని ఉన్నారు.

కృష్ణ దోషిలా నిలబడిపోయింది.

నేను అడుగు ముందుకేశాను.

"ఆగు" అన్నారు మాష్టారు.

నేను ఆగాను.

"ఆమెని తీసికెళ్లిపో."

ఆ మాటలకి ఆశ్చర్యంగా చూశాను.

కృష్ణ బోరుమంది.

మాస్టారి కళ్లు ఎర్రగా ఉన్నాయి.

"ఆమె కిక నా దగ్గర స్థానం లేదు. నువ్వు ఆమెని తీసికెళ్లు. లేకపోతే నా శవాన్ని చూస్తారు" ఆ మాటలకి తిరుగు లేదన్నట్టుగా అన్నారాయన

"సార్" అని ఏదో చెప్పబోయాను.

"నో ఆర్గ్యుమెంట్స్, నో కామెంట్స్ ప్లీజ్. టేక్ హర్" అన్నాడు.

నా తొందరపాటుకి జరిగిపోతున్న అన్యాయం నా కర్థమైంది. ఓ సంసారం కూలిపోయింది.

"అతనితో వెళ్లొచ్చు" అని ఆయన అన్నాడు కృష్ణతో.



కృష్ణ కన్నీళ్లతో నాకేసి చూసింది.

ఇక కృష్ణ అక్కడ ఉండి లాభం లేదు

ఆమెకి సుఖశాంతులు వుండవు. ఆమె జీవితం కూలిపోయింది. కారకుడ్ని నేనే!

కృష్ణ పాపని తీసుకోబోయింది.

మాస్టారు దానికి ఒప్పుకోలేదు.

కృష్ణ ఏడుస్తూంటే, ఓదారుస్తూనే నాతో తీసుకొచ్చాను.

నేను తీవ్రమైన సంఘర్షణకి గురైపోయాను.

కృష్ణని తీసుకొచ్చానే కానీ ఆమె మొహం చూడాలంటే భయంగా ఉంది. మానసికంగా ఆమె కృంగిపోయింది. పాపని గుర్తుచేసుకుని ఆమె విలపిస్తూంటే దోషిలా తలొంచుకోవడం మినహా నేను ఏమీ చేయలేకపోయాడు.

ఓ మంచివాడి సంసారాన్ని తోసేశాను.

నా ప్రియురాలి పచ్చని జీవితంలో నిప్పులు పోశాను.

ఓ పసిదానికి తల్లిని దూరం చేశాను.

నేనెంత పాపిని?

మాష్టారికి నచ్చచెప్పటానికి ఒకటి, రెండుసార్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

కృష్ణని నేను తీసుకొచ్చాననే తప్ప ఆమెని మాష్టారి భార్యగానే చూశాను. ఆమె సాంగత్యానికి నేను ప్రయత్నించలేదు. జరిగిపోయిన దారుణానికి పరిష్కార మార్గాన్ని వెతుకుతున్నానే కానీ

ఆమెని నేను సొంతం చేసుకోడానికి ప్రయత్నించలేదు.

ఒకటి, రెండుసార్లు కృష్ణ ఆత్మహత్యకి ప్రయత్నించింది. అదృష్టవశాత్తు నేను వాటినుంచి ఆమెని కాపాడుకో గలిగాను.

కాలచక్రంలో మరో సంవత్సరం తిరిగింది.

కృష్ణ మానసికంగా దిగజారిపోయింది.

ఆ దిగులుతో, అశాంతితో కృష్ణ చనిపోయింది.

కృష్ణని నా చేతులతోనే మట్టిచేశాను.

ఆ క్షణం నుంచీ ఇంతే!

నేను ఒంటరిగా మిగిలిపోయాను.

మాష్టారు కూడా తాగుడికి బానిసైపోయి, మృత్యువుకి చేరువైపోయాడు.

జరిగిన ఈ అనార్థాలకి నేనే బాధ్యుడినని నా అంతరాత్మ ఘోషిస్తోంది,

మాష్టారుపోతే కృష్ణ కన్నబిడ్డ ఏమైపోతుంది?

దిక్కులేని దయిపోతుంది.

*　　*　　*

నాలుగు రోజుల తర్వాత తెలిసింది.

రాజారావు పోయాడు.

రాజు దగ్గరుండి అన్నీ పూర్తి చేశాడని విన్నాను

రాజుకి అంతా తెలుసు, నా మీద అభిమానంకొద్దీ రాజు మాష్టారికి అంత్యక్రియలు చేశాడు.

నేను లోపల గదిలో కూర్చుని, కృష్ణ ఫోటోకేసి చూస్తున్నాను.

రాజు వచ్చాడు.

"మీకోసం ఓ గెస్ట్ వెయిట్ చేస్తోంది" అని చెప్పాడు.

ఎవరని నే నడగలేదు.

ముందు గదిలోకి వచ్చాను.

పద్నాలుగేళ్ళ పాప సోఫాలో కూర్చుని వుంది.

అచ్చు కృష్ణ పోలికల్ని పుణికి పుచ్చుకున్న ఆ చిన్నారిని చూడగానే నా గుండె పులకించింది.

"అంకుల్" అని పిలిచింది పాప.

నేను మెల్లగా వెళ్ళి ఆ పాపని చేతుల్లోకి ప్రేమగా తీసుకున్నాను.

"అంకుల్! డాడీ చెప్పారు - నన్ను మీ దగ్గర కెళ్ళమని" అంది.

నా కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నన్నిక మీ దగ్గరే వుండిపొమ్మని చెప్పారు డాడీ. మీరు నన్ను చూస్తారా, అంకుల్?"

నా కళ్ళలో నీరు నిండింది.

"తప్పకుండా నమ్మా, నిన్ను నా బిడ్డలాగా చూసుకుంటాను, నువ్వే నాకిక ఈ ప్రపంచమంతా" అన్నాను పాపని దగ్గరగా తీసుకుంటూ.

నేను చేసిన పాపానికి పరిష్కారం దొరికినట్టుగా అనిపించింది. ఏదో తృప్తి నాలో చోటు చేసుకొంటోంది.

"అంకుల్!"

"ఏమిటమ్మా?"

"మీరు కూడా తాగుతారా?" అడిగింది పాప ఖాళీ సీసాలనుచూసి.

"లేదమ్మా! ఇక తాగను. నువ్వు వచ్చావుగా, నేనిక తాగను" అన్నాడు.

పాప తృప్తిగా నవ్వింది.

"డాడీ చచ్చిపోయా డంకుల్" అంది పాప.

నేను పాప నుదిటిపైన ముద్దు పెట్టుకోవడం చూసి, రాజు తృప్తిగా నా భుజం పైన తట్టారు.

నేను బతకాలి...పాపకోసం బతకాలి.

ఆ పాపకి తండ్రినై బతకాలి.

ఇప్పుడు నాకు చావాలని లేదు. బతుకుతాను....పాప కోసం బతుకుతాను.

పాప చెక్కిళ్ళని నిమురుతూ "లేదమ్మా నేనే నీ డాడీని" చెప్పాను.

ఆ పాప కళ్ళలోని వెలుగు నాకు పూర్తిగా సంతృప్తిని కలిగించింది.

